డిస్కంల మార్పుతో మెరుగైన సేవలు

డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా

గ్రేటర్ పరిధిలోకి సంగారెడ్డి సర్కిల్

మేడ్చల్ జోన్‌లోకి మారుస్తూ సీఎండీ ఆదేశాలు జారీ

10 సర్కిళ్లతో గ్రేటర్ హైదరాబాద్..

సిటీబ్యూరో, జూన్ 12 (నమస్తే తెలంగాణ): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం) ప్రత్యేక చర్యలు చేపట్టింది. హైదరాబాద్ మహానగరం చుట్టూ ఉన్న ప్రాంతాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థతోపాటు వినియోగదారులకు అంతరాయంలేని సేవలు అందించే దిశగా మొదటి అడుగువేసింది. ఇప్పటి వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో మొత్తం 9 సర్కిళ్లు ఉండగా, కొత్తగా మరో సర్కిల్‌ను కలుపుతూ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో ఉన్న గ్రేటర్ పరిధిలోకి సంగారెడ్డి జిల్లా పరిధిలోని ప్రాంతాలను కలుపుతూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు సంగారెడ్డి సర్కిల్ పరిధిలో ఎల్‌టీ విద్యుత్ కనెక్షన్‌లు మొత్తం 7,91,364 ఉండగా, హెచ్‌టీ కనెక్షన్‌లు(పరిశ్రమలకు సంబంధించినవి) 2084 వరకు ఉన్నాయి. సంగారెడ్డి సర్కిల్ పరిధిలో సంగారెడ్డితోపాటు పటాన్‌చెరు, జహీరాబాద్, జోగిపేట డివిజన్‌లు ఉన్నాయి. వీటన్నింటిని కలిపి సంగారెడ్డి సర్కిల్‌గా ఏర్పాటు చేయగా, ఇప్పటి వరకు డిస్కం పరిధిలోని రూరల్ జోన్‌లో ఈ సర్కిల్ ఉండేది. దీన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మేడ్చల్ జోన్‌లోకి మారుస్తూ సీఎండీ ఆదేశాలు జారీ చేశారు.

10 సర్కిళ్లతో గ్రేటర్ హైదరాబాద్..

తెలంగాణ రాష్ట్రంలో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీ ఎస్‌పీడీసీఎల్) హైదరాబాద్ కేంద్రంగా, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీ ఎన్‌పీడీసీఎల్) వరంగల్ కేంద్రంగా విద్యుత్ వినియోగదారులకు సేవలు అందిస్తున్నాయి. అయితే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్‌లో 15 సర్కిళ్లు ఉండగా, అందులో 9 సర్కిళ్ల పరిధిలోనే 60-70 శాతం విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. తాజాగా సంగారెడ్డి సర్కిల్‌ను సైతం గ్రేటర్ హైదరాబాద్‌లో కలుపడంతో 10 సర్కిళ్లలో కలిపి మొత్తం 72 లక్షల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. విద్యుత్ డిమాండ్, ఆదాయం వచ్చే సర్కిళ్లన్నీ ఒకే పరిధిలోకి తీసుకువచ్చి మెరుగైన సేవలందించేందుకు డిస్కం ఉన్న తాధికారుల బృందం నిర్ణయం తీసుకుందని అధికారులు తెలిపారు. ముఖ్యంగా గ్రేటర్ చుట్టూ శరవేగంగా పట్టణీకరణ, పారిశ్రామిక కేంద్రాల్లో కొత్త పరిశ్రమలు వస్తుండటంతో విద్యుత్ సరఫరా అత్యంత కీలకంగా మారింది. ఈ విషయాలను పరిగణనలోకి తీసుకొని 10 సర్కిళ్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం కోసం, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా ఈ మార్పులు చేసినట్లు అధికారులు తెలిపారు.

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షా ఫీజును ఈనెల 15వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు. వివరాలకు వెబ్‌సైట్ www.osmania.ac. inలో చూసుకోవచ్చని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల(బీహెచ్ ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్షా తేదీలను ఖరారు అయ్యాయి. ఈ కోర్సుల రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలను ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నారు.

510 జీవో ఉద్యోగులకు న్యాయం చేయాలి

సుల్తాన్‌బజార్, జూన్ 12 : 510 జీవోలో అన్యాయానికి గురైన సుమారు 4వేల మంది ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎన్‌హెచ్ఎం రాష్ట్ర కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సంఘం నాయకులతో కలిసి కోఠిలోని ఎన్‌హెచ్ఎం కమిషనర్ కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుస్మితకు నాన్ 510 జీవో కాపీని అందజేసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం కార్యాలయం ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 510 జీవోతో నష్టపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఈ విషయమై కమిషనర్ స్పందిస్తూ అన్యాయం జరిగిన ఉద్యోగులందరికీ రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో బేసిక్ వేతనంతో పాటు క్యాడర్ ఫిక్సేషన్ చేసి 2018 నుచి అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన వివరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేశ్ గౌడ్, లావణ్య, ప్రకాశ్, లోకేశ్, భార్గవి, శ్రీమణి, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ చాంప్‌లో తెలంగాణ శుభారంభం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి, జూన్ 12 : జాతీయ స్క్వాష్ రాకెట్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర జట్టు శుభారంభం చేసింది. బుధవారం గోల్కొండ మైదానంలో తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మ్యాచ్‌లో రాష్ట్ర జట్టు 3-1 పరుగుల తేడాతో మహారాష్ట్రపై విజయం సాధించింది. జాతీయ స్క్వాష్ రాకెట్ చాంపియన్‌షిప్‌ను శాసన మండలి సభ్యుడు మహేశ్‌కుమార్ గౌడ్ ప్రారంభించారు. తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు చాతిరి బాబురావు సాగర్, మధు, మహేశ్వర్ సాగర్, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పాల్గుణ, తెలంగాణ స్క్వాష్ రాకెట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్ యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్. చిత్రంలో తలసాని శ్రీనివాస్ యాదవ్

శంకర్ యాదవ్ సేవలు మరువలేనివి

మంత్రి పొన్నం ప్రభాకర్

మారేడ్‌పల్లి, జూన్ 12: కార్మికుల నాయకుడిగా తలసాని శంకర్ యాదవ్ చేసిన సేవలు మరువలేనివని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ వెస్ట్‌మారేడ్‌పల్లిలోని రాధికా కాలనీలోని శంకర్ యాదవ్ నివాసానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం ఆయన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వీరి వెంట కాంగ్రెస్ హైదరాబాద్ నగర నాయకులు నవీన్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్‌లు ఉన్నారు.

నివాలర్పించిన మాజీ మంత్రి, డిప్యూటీ స్పీకర్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సోదరుడు తలసాని శంకర్ యాదవ్ చిత్రపటానికి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ డిప్యూటీ స్పీకర్ మధుసూదనాచారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు, ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలి

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభ రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న పద్మనాభ రెడ్డి

ఖైరతాబాద్, జూన్ 12: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సాధ్యమైనంత త్వరగా నిర్వహించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం స్థానిక ప్రభుత్వాల సాధికారత వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థలకు సంబంధించి ఈ ఏడాది జనవరి 31వ తేదీన గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసిందన్నారు. ప్రస్తుతం అధికారుల ఆధ్వర్యంలో పర్సన్ ఇన్‌చార్జిల పాలన సాగుతున్నదని, ఫలితంగా పంచాయతీల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక సంఘాన్ని ఏర్పాటు చేసి వాటికి చైర్మన్‌తో పాటు ఇతర సభ్యులను నియమించాలన్నారు. ఆర్థిక సంఘం సిఫారసుల ద్వారా పంచాయతీలతో పాటు మండల, జిల్లా పరిషత్‌లకు నిధుల కేటాయింపు జరుగాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక ప్రభుత్వాల సాధికారత వేదిక జాతీయ సమన్వయకర్త వీవీ రావు, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాస్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు యాదయ్య, వేదిక రాష్ట్ర సమన్వయకర్త బండారు రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి

కాచిగూడ, జూన్ 12: కేంద్ర ప్రభుత్వం బీసీలకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డాలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. కేంద్రం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో బీసీ సంక్షేమ హాస్టళ్ల నిర్మాణానికి చొరవతీసుకుని ప్రత్యేక గ్రాంటును మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పులిజాల కృష్ణ, ముత్యాల్‌రావు, ప్రదీప్‌గౌడ్, కిశోర్, ప్రశాంత్ నిమ్‌కర్, నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను కాపాడుకుందాం

బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12: రాష్ట్రంలో గురుకుల పాఠశాలలను నిర్లక్ష్యం చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నించడం దారుణమని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. కేసీఆర్ పాలనలో దశాబ్ద కాలంలో దేశంలో ఎక్కడాలేని విధంగా వెయ్యికి పైగా గురుకులాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గురుకులాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. గురుకులాలను నేడు కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టుపట్టించాలని చూస్తుందని ఆరోపించారు. అంబేద్కర్ చెప్పినట్లుగా విద్యతోనే వికాసమని, అందుకు గురుకులాలే ప్రత్యామ్నాయమని కేసీఆర్ భావించి, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గురుకులాలు సామాజిక రుగ్మతలకు కారణమవుతున్నాయని రేవంత్‌రెడ్డి భావించి, గురుకుల వ్యవస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. గురుకులాల్లో చదివిన విద్యార్థులే నేడు దేశ, రాష్ట్ర రాజకీయాలు, వ్యాపార, ప్రభుత్వ ఉద్యోగాలు, క్రీడలు, శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నారని గుర్తు చేశారు. ప్రపంచంలో ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కురాలు మాలావత్ పూర్ణ చదివింది కూడా గురుకుల పాఠశాలేనని చెప్పారు. గురుకుల వ్యవస్థను బలహీనపరిచే చర్యలను మానుకోవాలని ముఖ్యమంత్రికి హితవు పలికారు. లేనిపక్షంలో వివిధ విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

సమగ్ర కులగణన చేపట్టాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి, జూన్ 12 : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున జీవో 26 ప్రకారం సమగ్ర కులగణనకు ప్రత్యేక కమిషన్‌ను నియమించి ఇంటింటి సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్‌చారితో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన నిర్వహించి కుల జనాభా ఆధారంగా బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిందన్నారు. ఆ హామీని అమలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర క్యాబినెట్ అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో 26ను తెచ్చిందని, కులగణనకు రూ.150 కోట్ల బడ్జెట్ కూడా విడుదల చేసిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇంటింటి సర్వే చేసి బీసీ రిజర్వేషన్లను పెంచిన తరువాతే గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విక్రంగౌడ్, కనకాల శ్యామ్‌కుర్మా, గొడుగు మహేశ్, మహిళా నేత మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ ర్యాంకర్‌కు ఆర్థిక సాయం

పల్లవికి రూ.50వేల సాయం అందజేస్తున్న తులసీదాస్ మాంగ్ తదితరులు

రవీంద్రభారతి, జూన్ 12 : ములుగు జిల్లాకు చెందిన సంకేపల్లి పల్లవి ఇటీవల వెలువడిన గేట్ ఫలితాల్లో జాతీయస్థాయిలో 104వ ర్యాంక్ సాధించి ఐఐటీ ముంబైలో సీట్(ఎంటెక్) లభించింది. కానీ, ఐఐటీలో చేరి ప్రవేశ రుసుము చెల్లించే ఆర్థిక స్థోమత ఆమె కుటుంబానికి లేదని తెలుసుకున్న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్ బుధవారం తన హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యుల సమక్షంలో ఆమెను సన్మానించి రూ.50వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో జె.దేవేందర్, బి.గుణవంత్, జి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రేషన్‌కార్డులివ్వాలి

అబిడ్స్, జూన్ 12 : వలస కార్మికులకు రేషన్ కార్డులు అందజేయాలని సుప్రీంకోర్టు న్యాయస్థానం ఆదేశాలు జారీ చేయడంతో జంట నగరాల్లో ఈ-శ్రమ్ కార్డులు కలిగి ఉన్న కార్మికుల నివాసాలకు వెళ్లి పౌర సరఫరాల శాఖ అధికారులు సర్వే చేపట్టారు. జంట నగరాల్లో దాదాపు 51వేల వరకు వలస కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదై ఉండగా పౌరసరఫరాల శాఖ అధికారులు కార్మికుల నివాసాలకు వెళ్లి సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. జంట నగరాల ప్రధాన రేషనింగ్ అధికారి జి.ఫణీంద్రరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రమేశ్ నేతృత్వంలో సర్కిళ్ల వారీగా చెకింగ్ ఇన్‌స్పెక్టర్లకు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికుల సర్వేను చేపడుతున్నారు. జంట నగరాల్లోని తొమ్మిది సర్కిల్ కార్యాలయాల పరిధిలో ఈ సర్వే కొనసాగుతున్నది. చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లు కార్మికుల నివాసాలకు వెళ్లి వారికి రేషన్ కార్డు ఉందా? లేదా? కార్డులో పేర్లు యాడ్ చేయాల్సి ఉందా? అనే వివరాలు సేకరించి కార్డులు లేని వారి వివరాలు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 30వేల వరకు కార్మికుల సర్వే పూర్తి కాగా, మిగిలిన కార్మికుల నివాసాల్లో సర్వేను త్వరలో పూర్తి చేయనున్నట్లు హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎ.రమేశ్ తెలిపారు.

మార్కెట్‌లోకి భూమండల్ సేంద్రియ ఎరువు

హైదరాబాద్, బొమ్మరాస్‌పేట, షామీర్‌పేట లోని లియోనియా హోలిస్టిక్ డిస్టినేషన్ రిసార్ట్స్‌లో బుధవారం జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో పులియబెట్టిన సేంద్రియ ఎరువు భూమండల్ ఉత్పత్తిని మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి మునార్ ఆగ్రో సీఈఓ సీఎస్ఆర్ నాయుడు, నర్మదా బయోకెమ్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీహిమాలయ్ పటేల్, మునారా ఆగ్రో డైరెక్టర్ జేఎన్ఏ మూర్తి, మునారా ఆగ్రో బిజినెస్ హెడ్ పి.ప్రపూల్ తదితరులు పాల్గొన్నారు.

- సిటీబ్యూరో, జూన్ 12

సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి

లక్ష్మాపూర్ రెవెన్యూ సమస్యలు పరిష్కరించి ప్రజలకు మేలు చేయాలని లక్ష్మాపూర్ గ్రామ నాయకుడు క్యాతం మధుకృష్ణ సీఎంను కోరారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. లక్ష్మాపూర్‌లో రెవెన్యూ సమస్యల కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, అక్రమ రిజిస్ట్రేషన్లతో ప్రజలు, రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. సానుకూలంగా స్పందించిన సీఎం అధికారులకు రెవెన్యూ సమస్యలపై సూచనలు చేసినట్లు తెలిపారు. - శామీర్‌పేట, జూన్ 12

రీడింగ్ భవనానికి ప్రణాళికలు సిద్ధం చేయండి

ఓయూ ఆర్ట్స్ కళాశాలను సందర్శించిన ఇన్‌చార్జి వీసీ

ఆర్ట్స్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి వీసీ దానకిశోర్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12: ఉస్మానియా యూనివర్సిటీ మెయిన్ లైబ్రెరీ సమీపంలో 500 మంది విద్యార్థులు కూర్చునే సామర్థ్యంతో రీడింగ్ భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను వర్సిటీ ఇన్‌చార్జి వీసీ, పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ఆదేశించారు. బుధవారం ఆయన ఆర్ట్స్ కళాశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని లైబ్రెరీతోపాటు తరగతి గదులు, సెమినార్ హాల్స్, వివిధ అంతస్తుల్లోని గదులను పరిశీలించారు. తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులు, అధ్యాపకులతో ఆయన కాసేపు సంభాషించారు. కళాశాల భవనానికి రంగులు, పెయింటింగ్ వేయించేందుకు అవసరమైన నిధులను హెచ్ఎండీఏ నుంచి మంజూరు చేస్తామని తెలిపారు. ఆర్ట్స్ కళాశాల చుట్టూ ఫెన్సింగ్ వేయడంతోపాటు ఎస్‌బీఐ బ్యాంకు ముందు భాగంలో నూతనంగా లాన్ డెవలప్‌మెంట్ చేయాలని అధికారులకు సూచించారు. స్టూడెంట్ ఎక్స్‌చేంజ్ కార్యక్రమంలో భాగంగా థాయిలాండ్‌లోని యూనివర్సిటీలలో పరిశోధక విద్యార్థులు పరిశోధన చేసేందుకు ఆరుగురు ఎంపిక కాగా, వారికి హెచ్ఎండీఏ నుంచి ఫెలోషిప్‌తో సహకారం అందించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అర్జున్‌రావు, ఓఎస్డీ టు వీసీ ప్రొఫెసర్ రెడ్యానాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీనవేణి రామ్ షెఫర్డ్, ఓయూ చీఫ్ ఇంజినీర్ ప్రొఫెసర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష ఫలితాలపై విచారణ చేపట్టాలి

విద్యార్థి సంఘాల ఆందోళన

హిమాయత్‌నగర్ వైజంక్షన్‌లో నిరసన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

హిమాయత్‌నగర్/ఖైరతాబాద్/ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 12 : నీట్ పరీక్ష నిర్వహణ, ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులందరికీ తగిన న్యాయం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలను నిరసిస్తూ బుధవారం హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయ కులు రామకృష్ణ, శివ, అన్వర్, వంశీ, వెంకట్, సన్నీ, జోసెఫ్, మధు, బన్నీ, సాయి, హరీశ్, రాము పాల్గొన్నారు.

- నీట్ ఫలితాల్లో జరిగిన అవకతవకలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బిరాజ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏబీవీపీ నగర కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీనాథ్, పృథ్వీ, కల్యాణి పాల్గొన్నారు.
- నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీం కోర్టు జడ్జిచే విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య కోరారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్, శ్రీకాంత్, నాగరాజు, రమేశ్, దిలీప్ పాల్గొన్నారు.
- నీట్‌లో అవకతవకలపై సీబీఐచే విచారణ జరిపించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు డిమాండ్ చేశారు.

మహారాష్ట్ర నాసిక్‌లో జరిగిన జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. అండర్ 15-19 సీనియర్, జూనియర్ విభాగాల్లో జరిగిన పోటీల్లో తెలంగాణ జట్టు చివరి వరకు మంచి ప్రతిభ కనబర్చి రన్నరప్‌గా నిలిచింది.

- అడ్డగుట్ట, జూన్ 12

బ్రాహ్మణులను ఆదుకోవాలి

దారిద్ర్యరేఖకు దిగువనున్న బ్రాహ్మణులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందించి ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ప్రభుత్వ సలహాదారులు హర్కర్ వేణుగోపాల్‌రావును కోరారు. బ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమితి రాష్ట్ర ప్రచార కార్యదర్శి మంత్రి సునీల్, రాష్ట్ర ప్రతినిధి కరకపట్ల రామారావుతో కలిసి రమణారావుకు అందించారు. అన్ని రంగాల్లో బ్రాహ్మణుల పూర్వవైభవం కోసం బ్రాహ్మణ ప్రజా ప్రతినిధులు, మేధావులు తమ వంతు కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం శాలువాతో రమణారావును సన్మానించారు.

- అంబర్‌పేట, జూన్ 12